క్లుప్తంగా

హామీలను నెరవేర్చాలి



బాల్కొండ: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో పథకాలను అమలు చేస్తామని చెప్పి మాట మార్చారని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాజీనామా చేయాలన్నారు. తక్షణమే ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'వేసవి శిక్షణ బాగుంది'



మోర్తాడ్: వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థుల కోసం తిమ్మాపూర్ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం బాగుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ముత్తెన్న అన్నారు. మంగళవారం ఆయన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యామ్‌ను అభినందించారు. ఆయన వెంట వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

కుల గణన చేపట్టాలి



బాల్కొండ: రాష్ట్రంలో జన గణనతోపాటు కుల గణనను చేపట్టాలని మహాత్మా జ్యోతిరావు పూలే సమితి బాల్కొండ నియోజకవర్గ నాయకుడు దాసరి మూర్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శ్యామ్, బండి మల్లేశ్, సాయన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



నందిపేట్(ఆర్మూర్): గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ హెచ్చరించారు. మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీపీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని కంపోస్ట్ షెడ్, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. ఆయనవెంట ఎంపీవో కిరణ్‌కుమార్, కార్యదర్శులు ప్రశాంత్, సాయికుమార్ తదితరులున్నారు.

పని పరికరాలు అందజేయాలి



నవీపేట: గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు పని పరికరాలను అందజేయాలని జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ ఎంపీడీవో నాగనాథ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పది సంవత్సరాల క్రితం పని పరికరాలను అందజేశారని, మళ్లీ ఇప్పటి వరకు అందజేయలేదని తెలిపారు. పనిచేసే ప్రదేశంలో నీరు, నీడ సౌకర్యం కల్పించాలని కోరారు. కొలతలతో పని లేకుండా ఒక్కో కూలీకి రోజుకు రూ. 600 అందించాలని కోరారు. ఆయనవెంట వేదిక నాయకులు భూమ్‌రావు, అబ్బన్న, లక్ష్మణ్, గంగాధర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

హరితహారాన్ని పర్యవేక్షించాలి

రెంజల్(బోధన్): హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు, పెరిగిన చెట్లను సంరక్షణను పర్యవేక్షించాలని ఎంపీడీవో శ్రీనివాస్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇటీవల 'పచ్చని చెట్లు అగ్గిపాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కార్యదర్శులతో సమావేశమయ్యారు. పంట కొయ్యలకు నిప్పంటించే సమయంలో రైతులు రోడ్ల పక్కన మొక్కలు, చెట్లు కాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు.

ముంచుకొస్తున్న ముప్పు

- రైల్వే లోలెవల్ వంతెన కారణంగా అమ్రాద్‌తండా వాసులకు ఇబ్బందులు
- భారీ వర్షాలు కురిస్తే తండాకు రాకపోకలు బంద్
- ఐదేళ్లుగా నరకం చూస్తున్న గిరిజనులు
- ప్రత్యామ్నాయ చర్యలను మరిచిన యంత్రాంగం



గతేడాది లోలెవల్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన 'స్టాప్' బోర్డు (ఫైల్)



వర్షం నీరు వెళ్లేందుకు ఉన్న చిన్న రంధ్రం

మాక్లూర్: వర్షాకాలం వస్తోందంటే మండలంలోని అమ్రాద్ తండా వాసులు హడలిపోతున్నారు. తమ పరిస్థితి ఏమిటని ఆందోళనకు గురవుతున్నారు. తండా ముఖద్వారం వద్దే ఉన్న రైల్వే లోలెవల్ వంతెన వారికి శాపంగా మారింది. ఒకసారి వర్షం కురిస్తే లో లెవల్ వంతెన వద్ద నీరు నిలిచిపోయి తండాకు రాకపోకలు నిలిచపోతున్నాయి. నీరు ఖాళీ అయ్యేందుకు చిన్నపాటి రంధ్రం ఉండడంతో వర్షాకాలంలో రాకపోకలు 10 నుంచి 15 రోజుల పాటు నిలిచిపోతున్నాయి. వర్షాలు కురిసే సమయంలో తండావాసులు రోజులతరబడి తండాకే పరిమితమవుతున్నారు. మరోదారి లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో కొందరు వర్షపు నీటిని దాటితే.. మరికొందరు నిత్యావసర వస్తువుల కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రైల్వే పట్టాల పైనుంచి కాలినడకన వెళ్తారు. ఐదేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాకు రాకపోకలు నిలిచిపోయిన ప్రతి వర్షాకాలంలో కలెక్టర్ నుంచి మొదలుకొని ప్రజాప్రతినిధులు తండాను సందర్శించి పరిస్థితిపై విచారణ వ్యక్తం చేయడం, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం మామూలు విషయంగా మారిపోయిందని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు స్పందించాలని, వర్షాలు ప్రారంభం కాకముందే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తండాను విడిచిపోయే పరిస్థితి ఉంది



వర్షాకాలంలో తండాను విడిచి వెళ్లిపోయే పరిస్థితి వస్తుంది. అవతలి పక్కన ఉన్న అమ్రాద్ గ్రామంతోపాటు జిల్లా కేంద్రంలో అద్దెకు ఉండాల్సి ఉంటుంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా అందరం వెళ్లలేకపోయినా, కొందరు మాత్రం వెళ్లిపోతున్నారు. మేము తండాలోనే ఉంటాం. ఒక్కోసారి 20 రోజుల వరకు రాకపోకలు నిలిచిపోతాయి. రైల్వే లోలెవల్ వంతెన వద్ద చేరిన నీరు వెంటవెంటనే వెళ్లిపోయే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

– నాయక్, అమ్రాద్‌తండావాసి, మాక్లూర్

సమయ పాలన పట్టదా?



ఉదయం 9 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. పీహెచ్‌సీ సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉండగా, పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సులు మూడు షిఫ్టుల్లో ఒక్కొక్కరు విధులు నిర్వర్తించాల్సి ఉన్నప్పటికీ సమయపాలన పాటించడం లేదు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఒకరు చికిత్స కోసం రాగా.. పీహెచ్‌సీలో ఎవరు అందుబాటులో లేరు. దీంతో సదరు వ్యక్తి పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న కుర్చీలను వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

బోధన్: క్రమశిక్షణ, పట్టుదల తో కష్టపడి చదవితే మంచి భవిష్యత్ ఉంటుందని, చదువులో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయి ఎదగాలని విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా, రాష్ట్ర ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన డివిజన్‌లోని విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షుడు సిరిగాద పరమేశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు విద్యార్థుల ను శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

ముఖ్య అతిథి డాక్టర్ సాయికుమార్ హాజరు కాగా.. సంఘం రాష్ట్ర ప్రతినిధి సుక్కాల లక్ష్మణ్, సలహాదారు అమరవాజి కిరణ్, జిల్లా అధ్యక్షుడు రాఘవపురం గోపాలకృష్ణ, డివిజన్‌గౌరవ అధ్యక్షుడు మురహరి, ప్రతినిధులు వేణు, శ్రీనివాస్, సాయేందర్, రాజ్‌కుమార్, శ్రీధర్, లక్ష్మీ నారాయణ, శివాజీ, విశ్వ బ్రా హ్మణ సంఘం పట్టణ ప్రతినిధులు జనార్దన్, నాగరాజు, గంగాధర్, రాందాస్, కాశీదాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో సంఘం ప్రతినిధులు

పుట్టిన ఊరి రుణం తీర్చుకోండి



న్యూజెర్సీలో ఎన్ఆర్ఐలతో సమావేశమైన ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ఎన్ఆర్ఐలు పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలని, పల్లెల అభివృద్ధికి ముందుకు రావాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూజెర్సీలో మంగళవారం ఆయన బీజేపీ ఎన్ఆర్ఐ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, విదేశాల్లో ఉంటున్న భారతీయుల కోసం మోదీ చేస్తున్న పనులను వివరించారు. పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలని, ఆర్మూర్ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి ముందుకురావాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేలా పెట్టుబడులు పెట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తోడ్పాటు అందేలా చూస్తామని రాకేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న ఏవో నర్సయ్య

వేల్పూర్: మండలంలోని మోతె, పడగల్ సొసైటీల్లో రైతులకు జీలుగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి నర్సయ్య మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 కిలోల జీలుగ విత్తనాలను రెండున్నర ఎకరాల నుంచి మూడు ఎకరాల విస్తీర్ణంలో చల్లవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువు వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరగడంతోపాటు చౌడు ప్రభావం తగ్గుతుందని, రసాయన ఎరువుల వాడకం 20 శాతం తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు రాజేశ్, కృష్ణ, మోహన్, ఏఈవో షబ్బీర్, రైతులు పాల్గొన్నారు.

నవీపేట మండలంలో..



నవీపేట: మండల కేంద్రంతోపాటు బినోల, నాగేపూర్‌లో సొసైటీల ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీల సీఈవోలు రైతులకు సూచించారు. కార్యక్రమంలో నవీపేట, బినోల, నాగేపూర్ సొసైటీల సీఈవోలు మహేశ్‌గౌడ్, రమేశ్, మేక రమేశ్, డైరెక్టర్లు, ఏఈవోలు పాల్గొన్నారు.

పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు



రుద్రూర్: మండల కేంద్రంలోని గోశాలలో 80 ఆవులు, లేగ దూడలకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారి సంతోష్‌రెడ్డి ముద్ద చర్మవ్యాధి లక్షణాలను వివరించారు. పశువులకు వ్యాధి సోకుండా ముందుజాగ్రత్తగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఆవులో బుడిపెలు, కణతిలు ఏర్పడడం, నీరసించడం వంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త పడాలని సూచించారు. మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, బచ్చు రాము పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ప్రకటించాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలని, ఆ తరువాతే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆరే గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బీసీలకు 34 శాతం ఉన్న రిజర్వేషన్లను కేసీఆర్ ప్రభుత్వం 20 శాతానికి తగ్గించి అన్యాయం చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని, ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

ముచ్చటగా మూడు దశాబ్దాలకు..



వేల్పూర్: సుమారు 30 ఏళ్ల క్రితం ప్రారంభమైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. మండలంలోని అక్లూర్‌లో నిర్మాణ పనులను ప్రారంభించి పునాదులకు పరిమితం చేశారు. అప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం, నాయకులు తమ కోటా నుంచి నిధులు మంజూరు చేయకపోవడంతో దశాబ్దాల పాటు అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సమస్యను గుర్తించిన జెడ్పీటీసీ అల్లకొండ భారతీరాకేశ్‌చంద్ర 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో ఎట్టకేలకు పనులను పూర్తి చేశారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల వెనుక అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తయ్యింది.

ఒడిశాలో కోటపాటి ప్రచారం



ఆర్మూర్: పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు బీజేపీ అభ్యర్థి, కేంద్ర హెచ్ఆర్‌డీ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరఫున ఒడిశా రాష్ట్రంలో ప్రచారం చేస్తున్నారు. సంబల్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో గ్రామాల్లో మంగళ వారం నాయకులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఉండి కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా విధులు నిర్వహించి, ప్రస్తుతం కేంద్ర విద్యా మానవ వనరుల శాఖ మంత్రిగా ప్రధాన్ అందించిన సేవలను అక్కడి ప్రజలకు కోటపాటి వివరించారు. ఆయన వెంట ఆర్మూర్ మార్కండేయ మందిరం కమిటీ చైర్మన్ కొక్కుల విద్యాసాగర్ ఉన్నారు.

ఆధ్యాత్మికం..

■ **భక్తిశ్రద్ధలతో నృసింహుని కల్యాణోత్సవం**



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం స్వామి వారి జయంతి, కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శివ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాక్లూర్ మండలంలో..

మాక్లూర్ : మండలంలోని మానిక్‌బండార్ తండా, చిక్లిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వర్నిలో..

వర్ని (మోస్రా): మండల కేంద్రంలో లక్ష్మీనృసింహ స్వామి జయంతి వేడుకలను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేయడంతోపాటు సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



■ **నేడు బోధన్‌లో..**

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని బీటీ నగర్ కాలనీలో ఉన్న కోటమైసమ్మ సహిత లక్ష్మీనృసింహ స్వామి అష్టమ కల్యాణోత్సవంతోపాటు జన్మదిన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి పసులోటి గోపీకిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ హాజరవుతారని, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

■ **ఘనంగా సరస్వతీదేవి కల్యాణోత్సవం**



మాక్లూర్: మండల కేంద్రంలోని సరస్వతీమాత ఆలయంలో గ్రామస్తులు అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులతోపాటు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ **వైభవంగా ఆలయ వార్షికోత్సవం**



రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఆబాదిలోని అమరలింగేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని అర్చకుడు కాశీనాథ్ మహరాజ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కామారెడ్డికి చెందిన ఆదిత్యశర్మ, గాంధారికి చెందిన బాలకిషన్‌శర్మ సమక్షంలో అభిషేకం, కళశారాధన, నవగ్రహ, గణపతి, గౌరీ పూజ, హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

■ **మహతి ఆశ్రమానికి విరాళం**



బాల్కొండ: మండల కేంద్రంలోని పిల్లల మహతీ ఆశ్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విక్రం సింహరావు మంగళవారం రూ.3వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు గోపీకృష్ణ, కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలి



రెంజల్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

ఆర్మూర్/బోధన్/రెంజల్/కమ్మర్‌పల్లి: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడంతోపాటు కొత్త రుణాలను ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. రుణ మాఫీ చేయడంతోపాటు ఖరీఫ్ సీజన్‌లో కల్తీ మందులు, విత్తనాలను అరికట్టాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్మూర్‌లో నిర్వహించిన ధర్నాలో ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సారా సురేశ్, ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు ఏపీ గంగారాం, నాయకులు ఇస్తారి రమేష్, గంగాధర్, జిల్లా నాయకులు బి. మల్లన్న, అశోక్, లింబాద్రి, శోభన్ తదితరులు పాల్గొన్నారు. సాలూరలో నిర్వహించిన ధర్నాలో బోధన్ ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శి సుల్తాన్ సాయిలు, నాయకులు, సభ్యులు గంగారాం, లచ్చారాం, లక్ష్మీబాయి, రాజన్న, సరస్వతి, సంజీవ్, దత్తు, సాయిలు, నాయకులు అశోక్, బాలకిషన్, కిషన్, గంగాధర్, గంగారాం, సత్యమ్మ, బాలయ్య, రెంజల్‌లో నాయకులు నడిపి నాగన్న, ఒడ్డెన్న, పార్వతి రాజేశ్వర్, నసీర్, పోశెట్టి, లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ ఆర్డీవో రాజగౌడ్‌కు వినతిపత్రం..



సాలూర తహసీల్ కార్యాలయం ఎదుట..



కమ్మర్‌పల్లిలో..

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



కోటగిరిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

రుద్రూర్/వర్ని: ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు మరువలేనివని డీసీసీ డెలిగేట్ కొట్టం మనోహర్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షాహిద్, కొత్తపల్లి విండో చైర్మన్ సునీల్‌కుమార్, మాజీ ఎంపీపీ గంగాధర్‌రావు దేశ్‌ముఖ్, మాజీ జెడ్పీటీసీ శివరాజ్ దేశాయ్, బర్ల మధు, జంగం సాయిలు, నాగేంద్ర, హన్మంతు, సలీం తదితరులు పాల్గొన్నారు. చందూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దశాగౌడ్, వర్ని మండలం మాజీ ఉపాధ్యక్షుడు రామిరెడ్డి పాల్గొన్నారు.